# గుండమ్మ...గుండ్రాయి

**-డా.కొఠారి వాణీచలపతిరావు**

**ఓ ఆదివారంనాడు పిల్లల్ని తీసుకుని నేను, మా వారు పార్క్‌కెళ్ళాం. పిల్లలు లాన్‌లో ఆడుకుంటున్నారు. మేము కబుర్లు చెప్పుకుంటూ అక్కడే గార్డెన్‌లో కూర్చున్నాం. ఉన్నట్టుండి నా దృష్టి ఓ చోట పడింది. గుమ్మటంలా ఉన్న ఓ పూల చెట్టు మొదట్లో అరచేతిలో ఇమిడేటంతటి గుండ్రటి...నున్నటి రాళ్ళు ఓ వరుస క్రమంలో ఆర్టిస్టిక్‌గా అందంగా పేర్చి ఉన్నాయి. ఒకటికాదు రెండు కాదు బోలెడు రాళ్ళు. వాటిని చూడగానే నా మనసులో ఒక్కసారిగా ఆనందం, ఉద్వేగం ఇంతెత్తున లేచి...ఉన్న పళంగా కూర్చున్నచోటు నుంచి నేనూ లేచి "హాయ్...గుండ్రాళ్ళు!" అని అరిచాను.**

**ఏదో ఆలోచిస్తూ...ఎటో చూస్తున్న మా వారు "ఉండ్రాళ్లా! అవి ఇక్కడికెలా వచ్చాయ్...వినాయక చవితి వెళ్ళి చాలా రోజులయింది కదా!" అన్నారు.**

**"గుండ్రాళ్ళండీ...ఎంత బాగున్నాయో..." అంటూ ఒక్క పరుగున వాటి దగ్గరకి వెళ్ళి..ఒకటి చేతిలోకి తీసుకుని అటూ, ఇటూ తిప్పి చూస్తు వెర్రి ఆనందం పొందుతుంటే వెనుకగా వచ్చిన మావారు "ఏయ్..ఏంటది...ఆరాయి అక్కడ పెట్టు..సెక్యూరిటీ చూసాడంటే విజిల్ ఊదుతూ కర్రపట్టుకుని మరీ వస్తాడు. ఇక్కడ పూవు తెంపినా...ఆకు గిల్లినా గడ్డి పీకినా అది నేరం!" అన్నారు.**

ఆ మాటలతో అటూ...ఇటూ చూసి "ఏమండీ! ఒక్క రాయి హ్యాండ్ బ్యాగులో వేసుకుంటాను గప్‌చిప్‌గా! ఇలాంటి రాళ్ళు మనం సిటీ అంతా వెతికినా దొరకవు!'' అన్నాను.

"నీకేమయినా పిచ్చి పట్టిందా? ఆఫ్ట్రాల్ రాళ్ళని చూసి అంత ఎగ్జయిట్ అవుతావెందుకు?'' అన్నారు.

"మీకు తెలియదండీ...ఈ గుండ్రాయికీ...మా గుండమ్మత్తకూ..నా బాల్యానికీ ఉన్న సంబంధం! కొన్ని..కొన్ని వస్తువులు...కొంతమంది జీవితాలతో గాఢమైన అనుబంధం వేసుకుని మనసు మీద చెరిగిపోని ముద్రను వేస్తాయి'' అన్నాను.

మా పాప "డాడీ ఇలారా!'' అని పిలవడంతో ఆయన అటు వెళ్ళిపోయారు. నేను అదే అదను అనుకుని చుట్టుపక్కల ఎవరూ చూడటం లేదని నిర్ధారణకు వచ్చాక ఓ రాయి తీసి నా బ్యాగులో వేసుకున్నాను. గప్‌చిప్‌గా అక్కడినుంచి వచ్చేసాను. ఇంటికొచ్చాకగాని దాన్ని బయటకు తీసి...మా వారికి చూపించలేదు.

ఆయన ఆశ్చర్యపోతూ "మొత్తానికి ఆ రాయిని కొట్టేసావన్నమాట...అలా చేయటం తప్పుకాదూ?'' అన్నారు.

"ఎంతమాత్రం కాదు...ఎందుకంటే...ఇష్టమైన వస్తువును, అలభ్యమైన అపురూప వస్తువును దొంగతనం చేసయినా, ఇతరుల నుంచి లాక్కొని అయినా తీసుకోవచ్చన్నది ధర్మ సూక్ష్మం! ముద్దుల భార్య సత్యభామ ఒక్క పువ్వు కోరినందుకు ప్రతిగా శ్రీకృష్ణుడు స్వర్గలోకం మీదకి దండెత్తి ఏకంగా పారిజాత వృక్షాన్నే పెకిలించుకుని తీసుకొచ్చాడు'' అని నేను అంటూంటే మా వారు మధ్యలో అందుకున్నారు.

"ఇప్పుడు ఆ రాళ్ళ గుట్టంతా నేను పెకిలించుకుని రాలేదనా ఈ సాధింపు?'' అన్నారు.

"ఇంతకూ ఈ రాయిని ఏమంటారూ?''

"గుండ్రాయి!''

"గుండ్రంగా ఉంది కనుక గుండ్రాయి...అవునా? ఇంతకూ ఆవిడెవరూ....గుండ...గుండ్ర....?''

"గుండమ్మత్త...మా మేనత్త..మా నాన్నకు తను పెద్దక్క కావడం... మా నాన్న ఆరుగురి సంతానంలో నేను ఆఖరిదాన్ని కావడంతో ఆవిడ వరుసకు నాకు మేనత్త అయినా వయసులో మాత్రం మా బామ్మ అన్నట్టు ఉండేది. చిన్నతనంలోనే భర్తపోవడంతో మా నాన్న పంచనే...మా ఇంట్లోనే వచ్చి చేరింది...మా ఇంటికి పెద్ద దిక్కుగా మా అమ్మానాన్నల మన్ననలు అందుకుంటూనే..తన మాటలు, చేష్టలతో పిల్లలమైన మాకు బోలెడు వినోదాన్ని పంచిపెట్టేది...తన చాదస్తాలతో, పాత పద్ధతులతో విసిగించేది కూడా! వంటపని అంతా అమ్మ చేస్తే... పై పనులు కొన్ని అత్తయ్య చేసేది. అత్తయ్యకు 'పని' అంటే చాలా ఇష్టం. ఎప్పుడూ ఏదో పని చేతినిండా ఉండాలి!'' అని చెపుతూ వుంటే...

"ఇంతకూ గుండ్రాయి గురించి చెప్పవేం?'' అన్నారు మా వారు.

ఆ మాటలతో మా వంటింటికి ఆనుకుని ఉన్న సందు కిటికీలో ఎప్పుడూ కొలువై వుండే మా అత్తయ్య గుండ్రాయి గుర్తుకొచ్చి ఆ విషయం ఆయనకి చెప్పాను.


"ఆ గుండ్రాయికీ..మా అత్తయ్యకీ విడదీయరాని సంబంధం ఉండేది. ఎంతటి సంబంధం అంటే ఎప్పుడూ ఒకరినొకరు అంటిపెట్టుకునేంత. శనివారం దేవుడికి కొబ్బరికాయ కొట్టాలంటే 'ఆ గూట్లో గుండ్రాయి ఉండాలి..ఇలా తేండి పిల్లలెవరయినా?' అనేది. అలా అనగానే ఠక్కున లేచి నేనే ముందుగా పరుగెత్తి గుండ్రాయి తెచ్చి ఇచ్చేదాన్ని. ఆదివారం మేము పక్కలమీదినుంచి లేచి కళ్ళు నులుముకుంటూ గదులన్నీ దాటి...ముఖం కడుక్కోవడానికి సందుకు రాగానే 'టిక్కు..టిక్కు'మన్న శబ్దంతో గుండ్రాయితో సీరియస్‌గా కుంకుడుకాయలు కొడుతున్న అత్తయ్య కనిపించేది. ఆరోజు మా అందరికీ తలంట్లన్నమాట!

అలా కొట్టిన కుంకుడు కాయలను నీళ్ళలో నానబెట్టి...అందులో మందార ఆకులు కలిపి...అమ్మ రసం పోస్తుంటే..అత్తయ్య మా అందరికీ తలలు రుద్దేది. తలంటుల కార్యక్రమం అంటే అదో యజ్ఞం. వంటినిండా నువ్వుల నూనె

పట్టించి...పసుపు, శనగపిండితో నలుగు పెట్టి,...వేం మొత్తుకుంటున్నా వినకుండా వీపులు కాలిపోయేంతటి వేడి నీళ్ళు గంగాళం నిండా తోడి స్నానం చేయించేది అత్తయ్య.

"గుండ్రాయి...గుండ్రాయి.." అన్నారు మావారు నేను అసలు సబ్జెక్టు నుంచి డీవియేట్ అవుతున్నాని గుర్తుచేస్తూ.

"మా అత్తయ్య చేతుల్లోనే కాదు..మాట ల్లోనూ గుండ్రాయి ప్రముఖ స్థానం వహించేది. ఎవరన్నా చుట్టమో పక్కమో మా ఇంటికొచ్చి పాపం పెద్దమనిషి కదా అన్నట్టు..'ఎలా ఉన్నారు మామ్మగారూ?' అని అత్తయ్యను పలకరించటం ఆలస్యం "నాకేమయింది గుండ్రాయిలా ఉన్నాను. నువ్వే మరీ గులకరాయిలా ఉన్నావు. తిండీ, తిప్పలూ సరిగా తినవా?" అనేది.



అప్పుడు అలా అన్న మనిషి తను ఏ జీతగాళ్ళమీదో, పనివాళ్ళ మీదో కోపంతో అరిచేటప్పుడు 'గుంఢ్రాయిలా పుష్టిగా ఉన్నావ్ ఏం తీపరం...ఆ మాత్రం పని చేయలేవూ?' అనేది.

"ఇంతకూ మీ అత్తయ్యకున్న ఆ గుండమ్మ అన్న పేరుకూ, గుంఢ్రాయికీ కూడా ఏమయినా సంబంధం వుందా?"

"లేదు...అసలు మా అత్తయ్య పేరు వెంకట సుబ్బలక్ష్మి. మా ఇంటికి వచ్చిన కొత్తలో...మా పక్కనున్న టౌన్‌లోని ఓ టూరింగ్ టాకీస్‌లో గుండమ్మ కథ సినిమా వచ్చింది. అందులోని సూర్యకాంతంలా మా అత్తయ్య కూడా చేతులు తిప్పుతూ బానంత నోరు పెట్టుకుని పనివాళ్ళ మీద...జీతగాళ్ళమీద అరుస్తుండేది గనుక అచ్చం గుండమ్మగారే అంటుండేవాళ్ళు. అలా...అలా గుండమ్మగా ఆమె పేరు అందరికీ అలవాటైపోయింది. మొదట్లో తనను అలా పిలిచిన వాళ్ళందరినీ 'గుండమ్మ ఏంట్రా...గుండమ్మ..నా బొడ్డుకోసి పేరు పెట్టావా నువ్వు...సుబ్బలక్ష్మమ్మ గారు అని లక్షణంగా పిలవకపోయావంటే పళ్ళు రాలగొడతాను' అని గయ్యిమని అరిచింది. ఆ తరువాత... ఒరోజు ఉన్నట్టుండి అందరూ నన్నిలా ఎందుకు పిలుస్తున్నారు అని అనుమానం వచ్చి...సూర్యకాంతం సంగతి ఎవరో చెబితే...ఆఘమేఘాలమీద ఆ సాయంత్రమే బండి కట్టించి, అమ్మతోపాటు ఇరుగమ్మను, పొరుగమ్మను సినిమాకు తయారుచేసి, వెళ్ళి చూసి వచ్చింది.

ఆ తరువాత 'నేను మీకు సూర్యకాంతంలా కనబడుతున్నానా?' అని గుండమ్మ అని పిలిచిన వాళ్ళందరినీ దులిపి పెట్టింది.

అయినా అలవాటు..అలవాటే. అంత తొందరగా పోదుగా! ఆ తరువాత క్రమంగా ఆ పిలుపు ఆమెకూ అలవాటై పోయింది.

"మీ అత్తయ్యకు సంబంధించిన సంఘటనలన్నీ విచిత్రంగానే ఉన్నాయిగానీ..ఇక గుంఢ్రాయి దగ్గరకు వచ్చేసెయ్" అన్నారు మావారు.


"ఎప్పుడూ గూట్లో కొలువుండే గుంఢ్రాయి అత్తయ్యకు హస్తభూషణంగానో, అందుబాటులో ఉండే ఆయుధంలాగానో వుండేది. ఆయుధం అని ఎందుకన్నానంటే ఓసారి మా అత్తయ్య సందున కూర్చుని గుంఢ్రాయితో బెల్లం అచ్చును ముక్కలు కొడుతూ వుంటే ఓ దొంగ వెధవ సందు తలుపు తీసుకుని వచ్చి, అత్తయ్య మెడలోని రెండు వరసల పలకసర్ల గొలుసును లాగబోయాడట. అత్తయ్య 'దొంగ..దొంగ' అని అరుస్తూనే, చేతిలోని గుంఢ్రాయిపెట్టి దొంగ నెత్తిమీద ఒక దెబ్బ వేసింది. దాంతో కళ్ళు బైర్లు కమ్మి, వాడు దిమ్మ తిరిగి పడిపోయి, దొరికిపోయాడు. అత్తయ్య గొలుసు పోకపోగా దొంగ పట్టుబడటంతో అందరూ అత్తయ్యను తెగ మెచ్చుకున్నారు. అత్తయ్య మాత్రం ఆ బుజ్జిముండ సమయానికి నా చేతిలో ఉండబట్టి, వాడి నెత్తి పగలగొట్టగలిగాను అంటూ ఆ క్రెడిట్ అంతా గుంఢ్రాయికే ఇచ్చేసి దాన్ని తెగ మెచ్చేసుకుంది. అత్తయ్యకు అంత ప్రియమైన గుంఢ్రాయి మాకు మాత్రం ఒక్కోసారి బద్ధశత్రువులా అనిపించేది. ముఖ్యంగా ఆదివారం. నాకన్నా రెండేళ్ళు పెద్దదయిన మా శారదక్కయ్యకయితే గుంఢ్రాయి అంటే చచ్చేంత కోపం! పీత కష్టాలు పీతవి అన్నట్టు దాని కష్టాలు దానివి. దానికి తెగ బారెడు జుట్టుండేది.. నన్ను చిన్న స్టూలు మీద కూర్చోబెట్టి అత్తయ్య తల రుద్దుతే, దాన్ని పెద్ద స్టూలు మీద కూర్చోపెట్టి రుద్దేది. గుచ్చి..గుచ్చి, లాగి, పీకి తలంటి పోయడమేకాక అది లబోదిబో అని మొత్తుకుంటున్నా, కళ్ళవెంబడి నీళ్లు కూడా వస్తున్నా వినిపించుకోకుండా తల చిక్కుతీయడం, ఈర్పెనపెట్టి, పేల దువ్వెనపెట్టి దువ్వటం...ఇదంతా దానికి యమయాతనగా ఉండేది. అందుకే ఆదివారం వస్తున్నదంటే క్రితంరోజు సాయంత్రం నుంచే టెన్షన్ పడిపోయేది. ఓ శనివారం రాత్రి నన్ను రహస్యంగా దగ్గరకు పిల్చి 'చెల్లాయ్! ఎవరూ రాకుండా నేను చూస్తూ ఇక్కడ నిల్చుంటాను గానీ నువ్వు సందుకెళ్ళి, గూట్లో వున్న అత్తయ్య గుంఢ్రాయి ఇలా పట్టుకొచ్చెయ్' అంది.

'ఎందుకు?' అన్నాను నేను అమాయకంగా.

'గుంఢ్రాయి వుంటే అత్తయ్య రేపు పొద్దున్నే కుంకుడు కాయలు కొడుతుంది. అది లేకుంటే కొట్టలేదు కదా. అప్పుడు మనకు ఈ హెడ్‌బాత్‌ల బాధ వుండదు' అంది.

దాని ఐడియా నాకూ నచ్చేసి లటుక్కున లోపలికి వెళ్ళి, చిటుక్కున గుంఢ్రాయి కొట్టేసి తీసుకొచ్చేసాను.

అక్కయ్య దాన్ని మా మంచంకింద గోడ పక్కన మూలకి దాన్ని దాచేసింది. ఆ సమయంలో అత్తయ్య రేపు వడియాలు పెట్టడం కోసమని జీతగాడితో రోట్లో మినపప్పు రుబ్బిస్తూ కూర్చుంది గనుక మా ప్లాను బాగానే పని చేసింది. కానీ ఏం లాభం? ఐదు నిముషాలకే 'గూట్లో గుంఢ్రాయి ఏమయింది..పిల్లలూ మీరేమయినా తీసారా?' అంటూ పెద్ద కేక పెట్టింది



## పుట్టింటికి చేరిన అమీషా!

అమీషా పటేల్ చాలాకాలానికి తిరిగి పుట్టింటికి చేరినట్టే వుంది అంటున్నారు బాలీవుడ్ జనాలు. ఈమధ్య అమీషా- తన తల్లి ఆశాపటేల్‌తో కలిసి తరచూ కనిపిస్తోంది. కేవలం ముంబయిలోనే కాకుండా దుబాయ్‌లో సైతం షాపింగ్‌లు చేస్తూ తల్లీకూతుళ్లు జనాల్ని ఆకట్టుకున్నారట. విక్రమ్‌భట్‌తో ప్రేమాయణం విషయమై తల్లిదండ్రులతో విభేదించి దూరమైన అమీషా ఆ తర్వాత విక్రమ్‌కి కూడా దూరం అయింది. ఇప్పుడు మళ్లీ కన్నవాళ్లను చేరిందన్నమాట. మంచిదే కదా!



అత్తయ్య ఇల్లెగిరిపోయేలా.

అప్పుడే గుండ్రాయితో ఏం అవసరం వచ్చిందా? అని రోటి దగ్గరకి వెళ్ళి చూసాను. పాత్రం పిడి ఊడినట్టుంది. దాన్ని చేతిలో పట్టుకుని బామ్మ తెచ్చే గుండ్రాయితో కొట్టి బిగించాలని ఎదురు చూస్తూ ఉన్న జీతగాడు కనిపించాడు. మా పై ప్రాణాలు పైనే పొయ్యాయి.

ఇప్పుడెలా? అన్నట్టు అక్కవంక బేలగా చూసాను.

గుండ్రాయి..మంచంకింద దాచిపెట్టింది తెచ్చేస్తే దొంగతనం బయటపడుతుంది.

అందుకే ఇద్దరం చెప్పాపెట్టకుండా ఎదురింటివాళ్ళ పిల్లల దగ్గరకు ఆటలకు వెళ్ళాం.

అత్తయ్యకు మెంటల్ పీస్ ఉండదు ఈ రోజంతా పాపం! ఎంతగా ఆ గుండ్రాయికోసం వెతుకుతున్నదో, ఇల్లంతా ఒక కొలిక్కి తెస్తుందొచ్చు అని పించింది నాకు. అక్కయ్య మాత్రం ఆ విషయం మర్చిపోయి..ఆటల్లో మునిగిపోయింది.

పాత్రం పిడిని అత్తయ్య గుండ్రాయి లేకుండా ఎలా బిగించిందో తెలియదుగానీ...మేము వచ్చేసరికి పిండిరుబ్బే కార్యక్రమం అయిపోయింది. 'రేపు తలంట్ల కార్యక్రమం వుండదు. మనకు అంతే చాలు' అనుకుంటూ అక్కయ్య నేను ఆ రాత్రి మనశ్శాంతిగా గాఢ నిద్రపోయాం. ఉదయాన్నే అత్తయ్య కంచు కంఠపు అరుపులతో ఇద్దరికీ ఒకేసారి మెలవకువ వచ్చి దిగ్గున లేచి కూర్చున్నాం.

"నారాయణమ్మా...ఓ నారాయణమ్మా. ఒకసారి ఇలా వస్తావూ!'' అంటూ నాలుగు కాళ్ళ పీటమీద ఎక్కి గోడమీదుగా పక్కింటి నారాయణమ్మను పిలుస్తోంది అత్తయ్య.

"ఏంటండీ'' అంటూ ఆమె రాగానే,

"ఒక్కసారి మీ గుండ్రాయి ఇస్తావూ...కుంకుడు కాయలు కొట్టాలి. ఈరోజు పిల్లలకు తలంట్లు కదా...మా గుండ్రాయి రాత్రినుంచీ ఎక్కడో కనిపించకుండా పోయింది. ఇల్లంతా వెతకాను..'' అంది.

"తీసుకోండి! దానికేం భాగ్యం. గుండ్రాయేమన్నా అరిగిపోయేదా, కరిగిపోయేదా?'' అంటూ ఆమె ఆ గుండ్రాయి తెచ్చి ఇవ్వటం...అత్తయ్య టిక్కు టిక్కు మని కుంకుడుకాయలు కొట్టడం చూసి తలలు పట్టుకున్నాం నేనూ, అక్కయ్య. ఇంటింటికీ ఓ గుండ్రాయి వుండగా, మా ఇంటి గుండ్రాయి దాచిపెట్టినంత మాత్రాన అత్తయ్య పనులు ఆగిపోతాయా? మాకు తలంటి బాధ తప్పుతుందా? అనిపించగానే మంచంకింద నుంచి గుండ్రాయిని తీసి, "అత్తయ్యా ఇదిగో నీ గుండ్రాయి దొరికింది'' అని తీసుకెళ్ళి నేనే ఇచ్చాను.


"ఎక్కడ దొరికిందే?'' అంటూ తిరణాల్లో తప్పిపోయిన పసిపిల్లాడు అప్పుడే దొరికినంతగా, దాన్ని అక్కున చేర్చుకుని మురిసిపోయింది అత్తయ్య.

ఆ దృశ్యం ఇప్పటికీ నా కళ్ళముందు మెదులుతుంది. ఆ రోజునుంచీ నాకూ ఆ గుండ్రాయి అంటే బోలెడు ప్రేమ...అనుబంధం పెరిగిపోయాయి. ఇప్పటికీ...ఎక్కడైనా నున్నగా, గుండ్రంగా ఉన్న రాయి కనిపిస్తే మా అత్తయ్య ఆ రోజుల్లో నిత్యం ఉపయోగించిన ఆ గుండ్రాయే గుర్తుకు వస్తుంది. మా అత్తయ్య ఇప్పుడు లేదు కానీ ఆ గుండ్రాయింకా వుంది...పాత సామాన్ల గదిలో ఆమె గుర్తుగా. అప్పుడెప్పుడో మా ఊరు వెళ్ళినప్పుడు నేను ఆ గుండ్రాయిని ఫోటో తీసాను. దాన్నెందుకే ఫోటో తీస్తున్నావు. అదేమన్నా మనిషా లేక అందమైన దృశ్యమా? అంది అమ్మ ఆ రోజు. మనుషులతోటి, ప్రకృతితోటే కాదు..రాయీ రప్పతో, అంత ప్రాధాన్యం ఇవ్వాల్సినవి కావు అనిపించే ప్రతి వస్తువుతో మనిషికి ఓ అనుబంధం, మమకారం ఏర్పడిపోతాయి. అవి బాల్యంలో వాడిన వస్తువులయితే..ఆ జ్ఞాపకాలు మనసును మరింత మురిపిస్తాయి.

ఆ ఆనందం అనుభవించేవాళ్ళకే తెలుస్తుంది. అనుభూతిలేని వాళ్ళకు అది అర్థం కాదు..పైగా వాళ్ళు ఏళ్ళకు పిచ్చివాళ్ళుగా, విచిత్ర వ్యక్తులుగా కూడా అనిపిస్తారు'' అన్నాను నా ఫీలింగ్స్‌ని మా వారూ షేర్ చేసుకోవాలని ఆశిస్తూ. నేను ఆశించినట్టుగానే మా వారూ పార్కులో నుంచి నేను తెచ్చిన గుండ్రాయిని అటూ, ఇటూ తిప్పి చూస్తూ "మీ గుండమ్మత్త గుండ్రాయి కథ విన్న తరువాత నాకూ దీనిమీద అభిమానం పెరిగిపోతోం దోయ్...ఇప్పుడు వీటిని ఎవరూ వాడటం లేదు..పాపం! ఈసారి నువ్వు మీ పుట్టింటికి వెళ్ళినప్పుడు మీ అత్తయ్య ఉపయోగించిన ఆ గుండ్రాయి తెచ్చేసెయ్! పురాతన వస్తు ప్రదర్శనశాలలో పెట్టిద్దాం'' అన్నారు.

నా చెవులకు ఆ మాటలు జోక్‌గా కాక సీరియస్‌గానే అంటున్నట్టు వినిపించాయి.

★



## ఏనుగు వ్యాయామం

జర్మనీలోని మ్యూనిక్‌లోని టయర్ పార్క్ హెల్లాబ్రున్ జూలో 'పనాంగ్' అనే 20 ఏళ్ళ ఏనుగు గర్భవతిట. దాని ట్రెయినర్ దానిచేత రోజూ ప్రెగ్నెన్సీ ఎక్సర్‌సైజులు చేయిస్తున్నాడట! దానివల్ల దానికి పురుడు సులువుగా వస్తుందని.

## బ్రెడ్ స్లైసర్

1917లో ఫ్రెడిరిక్ రోవెడ్డర్ అనే అమెరికన్ శాస్త్రవేత్త ఆటో బ్రెడ్ స్లైసర్ మెషీన్‌ని కనుగొన్నాడు. అది బ్రెడ్‌ని కట్ చేయటమే కాకుండా రేపింగ్ కూడా చేస్తుంది!

-తటవర్తి

